సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం, 9, అక్టోబర్, 2023

## కళ్లకు గంతలతో నిరసన



సిరిసిల్లటౌన్: ఈ పంచాయతీ వర్కర్లు ఆదివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకున్నారు. ప్రాజెక్టు మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఆరోగ్యబీమా కల్పించాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండి స్వామి, గడ్డం శేషాద్రి, నర్సింగోజు శ్రీధర్, రమేశ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్


### రాజన్న భక్తులకు ఆన్‌లైన్ సేవలు



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: రాజన్న భక్తులకు ఆన్‌లైన్ సేవలను ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఇప్పటి వరకు మ్యానువల్‌గా ఉన్న సేవలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఉపయోగించుకోవచ్చని ఈవో పేర్కొన్నారు. అభిషేకాలు, అన్నపూజలు, ఇతర సేవలు, వసతి గదుల సేవలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఏఈవోలు హరికిషన్, జయకుమారి, ప్రతాప నవీన్ పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు పొందాల్సిన వారు vemulawadatemple.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలని సూచించారు.

### జెడ్పీటీసీ అభ్యర్థి ఓటు గల్లంతు




ఓటరు జాబితాలో డిలీట్ చేసిన మోర పద్మ ఓటు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల అధికారుల పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఏకంగా జెడ్పీటీసీ అభ్యర్థి ఓటు గల్లంతవడంతో ఓటర్ జాబితాపై అనుమానాలు కలుగుతున్నాయి. సరైన తీరులో ఓటర్‌జాబితాను పరిశీలించకుండానే ఇష్టానుసారంగా ఓట్లను తొలగించారని ఓటర్లు మండిపడుతున్నారు. గత స్థానిక ఎన్నికల్లో తంగళ్లపల్లి జెడ్పీటీసీగా సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీచేసిన మోర పద్మ ఓటును అధికారులు జాబితా నుంచి తొలగించారు. దీంతో మోర పద్మ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రేపు రాజన్న గుడి అందాలపై డ్రోన్ షో

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ రాజన్న గుడి, గుడి చెరువు, పట్టణంలోని అందాలను చూపించేందుకు మంగళవారం రాత్రి 7.30 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో డ్రోన్‌షో నిర్వహించనున్నారు. వేములవాడ గుడిచెరువు వద్ద 450 డ్రోన్లతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను తెలిపేలా మెగా డ్రోన్ షో నిర్వహించనున్నారు. పట్టణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని ఇందిరాపార్కు. కొద్దిరోజులుగా గ్రీనరీ వర్కర్స్ సమ్మెతో ఇలా పొదలు ఏపుగా మొలిచి శోభను కోల్పోతున్నాయి. కంటికి ఇంపైన పచ్చదనంతో ఆహ్లాదం పొందడానికి వస్తున్న ప్రజలకు పార్కులో మొలిచిన గడ్డితో ఇబ్బంది పడుతున్నారు.



ఈ చిత్రం ఇటీవల రూ.50లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సర్కిల్. నిత్యం నీరు పట్టకపోవడం, పిచ్చిమొక్కలు తీయకపోవడంతో ఇలా బోసిపోయి కనిపిస్తుంది. హైదరాబాద్ నుంచి సిరిసిల్ల నగరానికి వచ్చే తోవలో మానేరు తీరం వద్ద ఉన్న ఈ ప్రధాన సర్కిల్ కళావిహీనంగా మారింది.

# వేతనాలు వచ్చేదెప్పుడో?

- హరితశ్రామికులకు అందని వేతనాలు
- నెలల తరబడిగా ఎదురుచూపులు
- ఆర్థిక ఇబ్బందుల్లో కార్మికులు
- లీడర్లే కాంట్రాక్టర్లు
- స్పందించని అధికారులు



నీరు లేకుండా ఉన్న మొక్కలు



సమ్మెలో హరిత శ్రామికులు

సిరిసిల్లటౌన్: పచ్చదనంతో ఆహ్లాదం పంచే సిరిసిల్ల జిల్లా కేంద్రం బోసిపోతుంది. 39 వార్డులతో పట్టణం విస్తరించగా ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు రూ.4కోట్లతో నలుమూలలా 10 పార్కులు, రూ.2.15కోట్లతో ఆరు ప్రధాన కూడళ్లు, సుమారు రూ.10కోట్లతో పట్టణం నుంచి ఇతర నగరాలకు వెళ్లే ప్రధాన రహదారుల విస్తరణతోపాటు డివైడర్స్, వాటి మధ్యలో గ్రీనరీని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు పనిచేసే కార్మికులు జీతాలు రాక సమ్మెబాట పట్టడంతో హరితశోభ బోసిపోతున్న వైనంపై ఫోకస్..

**కాంట్రాక్టర్ల నిర్వాకంతో సమ్మెలోకి..**

జిల్లా కేంద్రంలో గ్రీనరీని కాపాడేందుకు మున్సిపల్ నిధులు రూ.కోటి కేటాయించారు. సిరిసిల్ల బల్దియా ఆరేళ్లుగా ఏటా టెండర్ల ద్వారా పనులు అప్పగిస్తుంది. ఈ ఏడాదికి నాలుగు స్లమ్ సమాఖ్యల పేరుతో కాంట్రాక్టు తీసుకున్నారు. పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లగా అవతార మెత్తారు. వరలక్ష్మి సమాఖ్య, శ్రీరాజరాజేశ్వర, చైతన్య, నాగదేవత సమాఖ్య నిర్వాహకులు పార్కులు, డివైడర్లు, జంక్షన్లలో పచ్చదనం నిర్వహణ కాంట్రాక్ట్ పొందారు. కొద్ది నెలల క్రితం టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పార్కులు, డివైడర్లు, జంక్షన్లలో గ్రీనరీ పనులకు రెండు విభాగాల్లో 42 మందిని నియమించుకున్నారు. పార్కుల్లో పనిచేసే వారికి తొమ్మిది నెలలుగా, డివైడర్లు, జంక్షన్లలో పనిచేసే వారికి నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదు. నెలల కొద్దీ వేతనాలు రాకపోవడంతో కార్మికులు సమ్మెబాట పట్టారు.

**కార్మికుల ఇబ్బందులు**

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలి. మహిళలకు నెలకు రూ.6,500, పురుషులకు రూ.7,500 చెల్లిస్తున్నారు.
- చెట్లకొమ్మలు, గ్రాస్ కట్ చేయడానికి పనిముట్లు ఇవ్వడం లేదు.
- నెలలో రెండు రోజులు మాత్రమే సెలవు. పండుగలు, ఇతర ముఖ్యదినాల్లోనూ పనిచేయాల్సి ఉంటుంది.
- డ్రెస్‌కోడ్, ఆప్రాన్, బూట్లు, హ్యాండ్ గ్లౌస్‌లు, మాస్కులు పూర్తిస్థాయిలో అందడం లేదు.

**కష్టంగా ఉంది**



నా భర్త చనిపోయాడు. ఆరేళ్లుగా గ్రీనరీ వర్కర్‌గా పనిచేస్తున్న. అంబేడ్కర్‌నగర్‌లో అద్దెకు ఉంటున్న. బిడ్డ రక్షిత ఆరోతరగతి చదువుతుంది. నాలుగు నెలలుగా జీతాల్లేక అరిగోస పడుతున్నం. నెలకు రూ.6,500 జీతం ఏమి సరిపోతలేదు.

– జె.శారద, యాదాద్రిపార్కు వర్కర్

**ప్రమాదకరంగా పనిచేస్తున్నాం**



మేం పనిలోకి పోతుంటే కుక్కలు కరుస్తున్నాయి. రోడ్ల వెంట స్పీడ్‌గా వెళ్తుండడంతో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. ఏపుగా పెరిగే పొదల్లో పాములుంటున్నాయి. డ్రిప్ ఉన్న చోట కరెంటు షాక్ వచ్చింది. ఎవరూ పట్టించుకోలేదు. సెలవు తీసుకుంటే జీతం కట్ చేస్తరు.

– తలారు లక్ష్మి, డివైడర్ గ్రీనరీ వర్కర్

**అదనపు పనులు చెప్పుతుండ్రు**



గ్రీనరీ వర్కర్లకు అదనపు పనులు చెప్పుతుండ్రు. బైపాస్ రోడ్లలో చెట్లు కొట్టే పనిచెప్పిండ్రు. మహిళలు పెద్దపెద్ద చెట్లు ఎట్లా కొడతారని కూడా ఆలోచించరు. పైసలస్తేనే పూట గడిసే కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే ఎట్లా. కనీసం యూరియా, యాసిడ్, బ్లీచింగ్ కూడా కాంట్రాక్టర్లు ఇస్తలేరు.

– మూశం రమేశ్, సీఐటీయూ నాయకుడు

# మున్సిపాలిటీ అయ్యేనా?



గంభీరావుపేట మండల కేంద్రం

- నాడు టౌన్ మున్సిపాలిటీ.. నేడు మేజర్ గ్రామపంచాయతీ
- మంత్రి కేటీఆర్ ప్రకటనతో మున్సిపాలిటీపై చిగురిస్తున్న ఆశలు
- మున్సిపల్‌గా మారితే గంభీరావుపేట దశ తిరిగినట్టే !

గంభీరావుపేట(సిరిసిల్ల):ఒకప్పుడు మున్సిపల్‌గా ఉన్న గంభీరావుపేట నేడు మేజర్ గ్రామపంచాయతీ. అయితే ఇటీవల మంత్రి కేటీఆర్ నోటి వెంట గంభీరావుపేటను త్వరలోనే మున్సిపాలిటీ చేస్తామని మాట రావడంతో స్థానికుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో ఉంది. మున్సిపాలిటీగా మారితే ఇక్కడ ఎలాంటి మార్పులు వస్తాయి అనే చర్చ జోరుగా నడుస్తోంది. ఇందుకు ఇటీవల తరచూ గంభీరావుపేటకు వచ్చిన ప్రతీసారి మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీ విషయాన్ని ప్రస్తావించడం ఈ చర్చలకు బలాన్నిస్తుంది.

**1952 నుంచి 1964 దాకా టౌన్ మున్సిపాలిటీ**

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ 1952 నుంచి 1964 సెప్టెంబర్ 23 వరకు టౌన్ మున్సిపాలిటీగా ఉండేది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే గంభీరావుపేటకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. అప్పట్లో సమితుల ఏర్పాటు సందర్భంగా గంభీరావుపేట మండలంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నూతన జిల్లాలు, మున్సిపాలిటీల ఏర్పాటు నుంచి గంభీరావుపేటను తిరిగి మున్సిపాలిటీగా చేయాలనే డిమాండ్ తెరమీదకు వచ్చింది.

**జనాభా అధికమే..**

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో దాదాపు 14వేల జనాభా ఉంటుంది. సుమారు 10వేల ఓటర్లు ఉంటారు. జిల్లాలో అధిక జనాభా, ఓటర్లు ఉన్న మండలాల జాబితాలో గంభీరావుపేటకు చోటుంది. పట్టణంలో ప్రస్తుతానికి 16 వార్డులు ఉన్నాయి. రోజురోజుకు పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. మంత్రి కేటీఆర్ గంభీరావుపేటపై ప్రత్యేక దృష్టి సారించడంతో పునర్వైభవం వస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**విలీన గ్రామాల్లో ఉత్కంఠ**

గంభీరావుపేటను మున్సిపాలిటీగా మార్చడానికి అవసరమైన జనాభా కోసం సమీప గ్రామాలను చేర్చుకోవాల్సిన అవసరం ఉంటుంది. మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న నర్మాల, ముస్తఫానగర్, పొన్నాలపల్లె, దమ్మన్నపేట గ్రామాలను మున్సిపాలిటీలో భాగం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని రాజకీయ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. పల్లె నుంచి పట్టణ దశకు చేరితే భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. వివిధ రకాల పన్నులు పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు.

**మంచి భవిష్యత్**



రానున్న కాలంలో గంభీరావుపేటకు మంచి భవిష్యత్ ఉంటుంది. టౌన్ మున్సిపాలిటీ నుంచి మేజర్ గ్రామపంచాయతీగా మారిన గంభీరావుపేటకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నాం. అన్ని రకాలుగా పట్టణం అభివృద్ధి చెందుతుంది. కేటీఆర్‌కు ప్రజలు రుణపడి ఉంటారు.

– అబ్దుల్ మజహర్, గ్రామస్తుడు, గంభీరావుపేట

**రూపురేఖలు మారుతాయి**



గంభీరావుపేట మున్సిపాలిటీగా త్వరలోనే మారుతుందని అనుకుంటున్నం. పట్టణ రూపురేఖలు కనీవినీ ఎరుగని రీతిలో మారుతాయి. ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాం. అభివృద్ధిలో గంభీరావుపేట పరుగులు పెడుతోంది. మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– కటకం శ్రీధర్‌పంతులు, గంభీరావుపేట, సర్పంచ్

## భక్తులకు మెరుగైన సేవలందించాలి

- ఈవో కృష్ణప్రసాద్
- ఇద్దరికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి



పురాణం వంశీమోహన్‌కు ప్రమోషన్ ఉత్తర్వులు అందిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: భక్తులకు మెరుగైన సేవలందించాలని ఈవో కృష్ణప్రసాద్ కోరారు. రాజన్న ఆలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ అశోక్, పురాణం వంశీమోహన్‌లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు అందజేశారు. ప్రమోషన్ పొందిన అశోక్, వంశీలను సహచర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

**బ్యాక్‌వాటర్‌లో పంట చేలు**





తంగళ్లపల్లి(సిరిసిల్ల): మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ ముంపు ప్రాంతాన్ని ముంచెత్తింది. చీర్లవంచ, చింతలఠాణా, గోపాల్‌రావుపల్లి, తాడూర్ గ్రామల శివారు ప్రాంతాల్లోకి భారీగా జలాశయం బ్యాక్‌వాటర్ చేరింది. గోపాల్‌రావుపల్లి గ్రామపరిధిలో దాదాపు అరకిలోమీటరు మేరకు నీరు చొచ్చుకురావడంతో గ్రామ శివారులో వేసిన వరి పంటలు నీటమునిగాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట నీటిలో మునిగిపోయింది.

# నీళ్లు.. నిధులు నియామకాలు సాధించుకున్నాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ముస్తాబాద్ మండలంలో సుడిగాలి పర్యటన
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీ



డంపింగ్‌యార్డును ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు.. నిధులు.. నియామకాలు సాధించుకున్నామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబాటుకు గురైన తెలంగాణను సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. కోటి ఎకరాలకు నీరందించేందుకు ప్రాజెక్టులు, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథతో దేశానికే రోల్‌మోడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు.

**అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు**

మద్దికుంటలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, మహిళా భవనం, అంగన్‌వాడీ కేంద్రం, పల్లెప్రకృతి వనం, డంప్‌యార్డు, శ్మశానవాటికలను వినోద్‌కుమార్ ప్రారంభించారు. లైబ్రరీ పనులకు భూమిపూజ చేశారు. బందనకల్‌లో గ్రామపంచాయతీ భవనం, విద్యుత్ సబ్‌స్టేషన్, ముస్తాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు కుట్టుమిషన్లు, పోతుగల్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు అందించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. సీసీరోడ్లు, ప్రగతి భవన్‌ను ప్రారంభించారు. గన్నెవారిపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామపంచాయతీ భవనాలను వినోద్‌కుమార్ ప్రారంభించారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, సర్పంచులు సుమతి, భాగ్య, గౌతంరావు, వెంకటేశ్వరీ, లక్ష్మి, కిషన్‌రావు, రవీందర్‌రెడ్డి, నాయకులు చందు, వెన్నమనేని శ్రీనివాస్‌రావు, యాదగిరిగౌడ్, విజయరామారావు, సర్వర్, పండరి, కొమ్ము బాలయ్య, షాదుల్, మనోహర్, నవాజ్ పాల్గొన్నారు.

**స్వయం పాలనతో అభివృద్ధి సాధించాలి**

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మేజర్ గ్రామపంచాయతీల నుంచి విడిపోయిన చిన్న గ్రామాలు స్వయం పాలనతో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అగ్రహారంలో రూ.20 లక్షలతో ఆధునిక హంగులతో నిర్మించిన జీపీ నూతన భవనాన్ని ప్రారంభించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పాలనను దరి చేర్చాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ తండాలను, 500పై చిలుకు జనాభా ఉన్న గ్రామాలను కొత్తగా గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ మునిగే అమృత, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు, నాయకులు అందె సుభాష్, నర్సయ్య పాల్గొన్నారు.

**మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం**



చెక్కులు పంపిణీ చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం 120 మంది మైనార్టీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, 425 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలో మైనార్టీ గురుకులాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాణి మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మైనార్టీశాఖ అధికారి సర్వర్‌మియా ఉన్నారు.

## క్లుప్తంగా

### సబ్బండ కులాల స్వరాజ్య స్థాపనే లక్ష్యం



శిలాఫలకం వద్ద డీఎస్పీ నాయకులు

బోయినపల్లి(వేములవాడ): సబ్బండ కులాల స్వరాజ్య స్థాపనే లక్ష్యమని డీఎస్పీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు ఎడపెల్లి బాబు, ఉల్లెందుల అరుణ్ పేర్కొన్నారు. దళిత్ శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బోయినపల్లికి వచ్చి ఏడాది గడిచిన సందర్భంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. శిలాఫలకం వద్ద పూలు చల్లారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్య పోరాటాలు చేసి రాజ్యాధికారం దక్కించుకోవాలని కోరారు. కుర్మ సురేశ్, కుడుకల మధు, దాసరి సురేశ్, నక్క మోహన్, పర్లపల్లి నాగరాజు, సుమన్ పాల్గొన్నారు.

### డబుల్ అర్హులపై రీసర్వే చేయాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులపై రీసర్వే చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. డబుల్ ఇళ్లు పొందిన కొందరు అనర్హులు వాటిని గెస్ట్ హౌస్‌లుగా వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. అధికారుల సర్వేలో పారదర్శకత లోపం, అవినీతికి తావివ్వడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్ స్పందించి వెంటనే రీసర్వే చేయించి అనర్హులను తొలగించాలన్నారు. కోడం రమణ, శ్రీరాం సదానందం, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, గుండేటి కనకయ్య, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

### గోశాలకు రాజన్న కోడెలు



కోడెలు అందిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను ఆదివారం గోశాలకు అందించారు. జనగామ జిల్లా దేవరుప్పాలపల్లె మండలం ధర్మపురం గ్రామానికి చెందిన శ్రీభద్రకాళి గోశాలకు 20 కోడెలు అందజేశారు.



# డేంజర్ స్పాట్స్

- ప్రాణాలు పోతున్నాయి
- అతివేగం..అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
- జిల్లాలో నెల వ్యవధిలో 30 సంఘటనలు
- ఏడుగురి మృతి.. 39 మందికి గాయాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- కనిపించని హెచ్చరికబోర్డులు



ఇది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని అతి ప్రమాదకర మూలమలుపు. ఈ ప్రాంతంలో వారంలో రెండు, మూడు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మూలమలుపును ప్రయాణికులు డేంజర్‌స్పాట్‌గా భావిస్తారు. గతంలో రెండు సంఘటనల్లో నలుగురు మరణించారు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపైనే ఉన్న ఈ మూలమలుపు వద్ద కనీసం హెచ్చరికబోర్డులు లేవు. ఈ రోడ్డు వెంట ఉన్న మూలమలుపులతోపాటు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపై కూడా కనీస రక్షణ చర్యలు చేపట్టడం లేదు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో రోడ్లు డేంజర్‌స్పాట్స్‌గా మారుతున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఫలితంగా బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జిల్లాలోని గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతం నుంచి మొదలుకొని బోయినపల్లి మండలం కొదురుపాక వరకు ప్రమాదకర మూలమలుపులు అనేకం ఉన్నాయి. జిల్లాలో నెల వ్యవధిలో 30 రోడ్డు ప్రమాదాలలో ఏడుగురు చనిపోయారు. 39 మంది గాయపడ్డారు. ఇందులో తొమ్మిది ప్రమాదాలు ఇసుక ట్రాక్టర్లతోనే జరిగాయి. క్షతగాత్రుల్లో 30 శాతం మంది పనులు చేయలేని పరిస్థితుల్లో అంగవైకల్యులుగా మారారు.

**ప్రమాదకర మూలమలుపులు ఇవే..**

- రాజన్నసిరిసిల్ల జిల్లాలోని కామారెడ్డి– కరీంనగర్ ప్రధాన రహదారిపై ప్రమాదకర మలుపులు.. పెద్దమ్మస్టేజీ, సముద్రలింగాపూర్, రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి, వెంకటాపూర్, పెద్దూరు, సర్దాపూర్, సిరిసిల్ల బైపాస్‌రోడ్డు, చంద్రంపేట ఎక్స్ రోడ్డు, వేములవాడ కమాన్, నాంపల్లిగుట్ట, కొదురుపాక, వెంకట్రావుపల్లి
- సిరిసిల్ల–సిద్దిపేట మార్గంలో.. తంగళ్లపల్లి, పద్మనగర్ శివారులోని పెట్రోల్‌బంక్ వద్ద, జిల్లెల్ల.
- జిల్లాలోని అంతర్గత రహదారుల్లో ఇలా.. కంచర్ల, వీర్నపల్లి సబ్‌స్టేషన్లు, ముస్తాబాద్ శివారులో రెండు చోట్ల, ఎల్లారెడ్డిపేట బైపాస్‌రోడ్డు.
- వేములవాడ–కోరుట్ల రహదారిలో.. చందుర్తి మూలమలుపు, రుద్రంగి శివారు, కథలాపూర్‌లో రెండు చోట్ల అత్యంత ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి.



సర్దాపూర్ శివారులో ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

- ఈ మార్గాల్లో ఎక్కడ కూడా హెచ్చరికబోర్డులు కానీ, ఎలాంటి రక్షణ చర్యలు అధికారులు తీసుకోలేదు.

**నెల రోజుల్లో 30 ప్రమాదాలు**

జిల్లాలో నెల రోజుల వ్యవధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 30 ప్రమాదాలు జరుగగా.. ఏడుగురు మరణించారు. 39 మంది గాయాలతో బయటపడ్డారు. కాగా అనధికారికంగా జిల్లాలో సుమారు 45కు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. ప్రాణాలు పోతే తప్ప ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల దృష్టికి రావడం లేదు. జిల్లాలో రెండు నెలల వ్యవధిలో ఇసుక ట్రాక్టర్లతోనే 11 ప్రమాదాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు ఒకే నెలలో రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. ఆ బాధిత కుటుంబాలను పట్టించుకునే వారు లేకపోవడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. పిల్లలను చదివించే స్థోమత లేక వారు కూలీలుగా మారిపోతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలతోపాటు రోడ్డు రవాణాశాఖ అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### పట్టించుకోని అధికారులు



అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్న చోట అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. మూలమలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేస్తే రాత్రి పూట సులువుగా గుర్తుపట్టే అవకాశం ఉంటుంది. ఈ మార్గాల్లో కొత్త వారు ప్రయాణించినప్పుడు మూలమలుపులు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకటాపూర్

### అతివేగంతోనే ప్రమాదాలు



మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తోంది. మూలమలుపుల వద్ద హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖకు విన్నవించాం. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– శశిధర్‌రెడ్డి, సీఐ, ఎల్లారెడ్డిపేట

## ఆరు గ్యారంటీలతో ముందుకొస్తున్నాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ముందుకొస్తుందని, ప్రజలు ఆశీర్వదించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. స్థానిక భగవంతనగర్‌లో గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా ఆదివారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే 6 గ్యారంటీ డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ఆరు గ్యారంటీల హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు సంఘ స్వామియాదవ్, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, తోట లహరి, నాగుల రాముగౌడ్, నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, నీలం గురువయ్య, మండలోజు సందీప్, దుర్శెట్టి అరుణ్ తేజాచారి, లింగం, మల్లిపల్లి రాజు, భరత్ తదితరులు ఉన్నారు.

**రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తాం**

కోనరావుపేట(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల్లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ఆదివారం మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందిస్తామన్నారు. నాయకులు షేక్ ఫిరోజ్‌పాషా, ఎల్లాల రాంరెడ్డి, సాసాల మల్లారెడ్డి, ప్రేమ్‌చంద్, వేణురెడ్డి, సాగర్, రాములు, గుండెకార్ల సంజీవరావు, బుర్ర సాయి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

### వెంకట్రావుపేటవాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అనిల్‌కుమార్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన కర్నాల అనిల్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. గ్రామానికి చెందిన కర్నాల అనిల్ కుమార్ మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణ యువచైతన్య ఫౌండేషన్ ద్వారా కొన్నాళ్లుగా సామాజిక సేవ చేస్తున్నాడు. అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతున్నాడు. అనిల్‌కుమార్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది.

# మార్కెట్ పాలకవర్గం మారేనా?

- చైర్మన్‌గా వేములవాడ మండలవాసి అని జోరుగా చర్చ
- రాజీనామా బాటలో సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మారనున్నట్లు ఐదు రోజులుగా స్థానికంగా చర్చ సాగుతోంది. గతేడాది నవంబర్ 11న 18 మంది సభ్యులతో వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. చైర్మన్‌గా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన మిర్యాల ప్రభాకర్‌రావుతో పాటు 17 మంది సభ్యులు ఉన్నారు. వేములవాడ, వేములవాడరూరల్, అర్బన్, కోనరావుపేట, నాలుగు మండలాలకు కలిపి ఈ మార్కెట్ కమిటీని నియమించారు.

**నిజామాబాద్ ఏఎంసీ ఏర్పాటుతో..**

ఇటీవల కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు కొత్తగా మార్కెట్ కమిటీని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో వేములవాడ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న చైర్మన్‌తో సహా ముగ్గురు సభ్యులు కూడా కోనరావుపేట ప్రాంతానికి చెందిన వారు. దీంతో వారిని అక్కడి కమిటీలోకి బదలాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అదే సమయంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌తోపాటు మరో ముగ్గురు సభ్యులకు నూతనంగా అవకాశం కల్పించాలని ఇటీవల నలుగురు సభ్యుల వివరాలతో నివేదికను పంపినట్లు విశ్వసనీయ సమాచారం. 11 నెలల కాలవ్యవధిలోనే వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో మార్పులు జరుగుతున్నట్లు ప్రచారంలో ఉంది. నూతన చైర్మన్‌గా వేములవాడ రూరల్ మండలం నుంచి ఓ సీనియర్ సర్పంచ్‌ను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఏది ఏమైనా అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడం, మార్కెట్ కమిటీ పాలకవర్గం మారుతున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.



వేములవాడ మార్కెట్ కమిటీ కార్యాలయం

## యోగా అదుర్స్



సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీలు అలరించాయి. జిల్లాస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు యోగాసనాలు అలరించాయి. దుమాల గిరిజన పాఠశాల, సిరిసిల్ల, తాడూరుకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, కౌన్సిలర్లు గూడూరి భాస్కర్, గెంట్యాల శ్రీనివాస్ మాట్లాడారు. యోగా సాధన నిత్య జీవితంలో భాగంగా మారాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అసోసియేషన్ కార్యదర్శి, యోగాచార్యుడు ఉప్పల శ్రీనివాస్ నేతృత్వంలో పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. యోగాచార్యులు ఉప్పల శ్రీనివాస్, జ్యోతి, రచన, దుబాల మొండయ్య, లింబాద్రి, మనోజ్, జ్యోతి, సంధ్యా, రచన తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని చిదిమేసిన కారు

- ఆరేళ్లకే నూరేళ్లు
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- గాజులపల్లిలో విషాదం



స్వాతి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని గాజులపల్లిలో ఆరేళ్ల చిన్నారిని అతివేగంగా వచ్చిన కారు చిదిమేసింది. ఈ ప్రమాదంలో చుట్టపుచూపుగా వచ్చిన చిన్నారి మృతితో గాజులపల్లిలో విషాదం నిండింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పట్టణానికి చెందిన కొట్టెం పద్మ–రామారావు దంపతుల కూతురు స్వాతి(6)తో కలిసి గాజులపల్లిలో ఉంటున్న సమీప బంధువుల ఇంటికి ఆదివారం వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఎల్లారెడ్డిపేటకు చెందిన ఓ ప్రముఖుడు తన కారులో సిరిసిల్ల నుంచి మండల కేంద్రానికి వస్తుండగా రోడ్డు దాటుతున్న స్వాతిని అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తల పగిలిపోవడంతో చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్సై రమాకాంత్ అక్కడికి చేరుకొని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం స్వాతి మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. న్యాయం చేయాలంటూ కుటుంబీకులు, గ్రామస్తులు సిరిసిల్ల–కామారెడ్డి రోడ్డుపై ధర్నా చేశారు.



ధర్నా చేస్తున్న చిన్నారి బంధువులు, గ్రామస్తులు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని.. ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. ఇల్లంతకుంట మండలం అనంతారంలో ఆదివారం పర్యటించారు. రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆలోచించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ మెరుగయ్యాయన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# ఆరె క్షత్రియుల సంక్షేమానికి కృషి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు
- వేములవాడలో ఆత్మీయ సమ్మేళనం

వేములవాడ: ఆరె క్షత్రియుల సంక్షేమానికి, సంఘానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా ఆరె క్షత్రియ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలతో మూడోసారి గెలిపించాలని కోరారు. తాను గెలిచిన వెంటనే వేములవాడలో ఆరె క్షత్రియ సంఘానికి 20 గుంటల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆరె కులస్తులు ఐక్యంగా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు కాతుబండ నర్సింగరావు, హింగే శ్రీనివాస్, సిలువేరి మల్లేశం, సూర దేవరావు, ఎంగ్రాల అశోక్, ఎంగ్రాల రాజు, ముంజేడి గోపాల్, సర్పంచులు ఇటిక్యాల నవీన–రాజు, లింగంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు ఆసరాగా ఆరు గ్యారంటీ పథకాలు ఉన్నాయని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500లకే సిలిండర్, ఎస్సీ ఉపకులాలకు కొత్తగా మూడు ఎస్సీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, సర్పంచ్ కూస పద్మ, నాయకులు ఏనుగుల కనకయ్య, కట్ట లచ్చయ్య, బండి శ్రీను, అనుముల హరికృష్ణ, నాగుల వంశీ, బోయిని ఎల్లేశ్, నిమ్మ వినోద్‌రెడ్డి, ఎర్ర లింగారెడ్డి, మహేందర్, ఏనుగుల ప్రశాంత్, మల్కాపురం అనిల్, ఆకుల అజయ్, తిరుపతి, ప్రశాంత్, ఎండీ రఫీ ఉన్నారు.



నీలోజిపల్లిలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

# మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తండ్రి మానసిక వేదనకు గురై చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. మండలంలోని మొర్రాపూర్ తండాకు చెందిన భూక్య బీమానాయక్(60) ఆదివారం గ్రామ శివారులోని తన పొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న బీమానాయక్‌ను కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బీమానాయక్ పెద్ద కుమారుడు శ్రీనివాస్‌నాయక్ రెండేళ్ల క్రితం దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య సుందరి పక్షవాతంతో బాధపడుతోంది. అప్పటి నుంచి బీమానాయక్ మానసికంగా కుంగిపోయి, పిచ్చిగా ప్రవర్తించేవాడు. కొడుకు చనిపోయాడనే వేదనతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు జగన్‌నాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



బీమానాయక్ (ఫైల్)

## కవి ‘జమార’ మృతి

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రానికి చెందిన కవి, రచయిత నమిలికొండ జగన్మాథవరావు (జమార)(75) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. కొడిమ్యాల మండలం పూడూర్‌కు చెందిన జగన్మాథవరావు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చాలా ఏళ్ల క్రితం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందాడు. గత 40 ఏళ్లుగా బోయినపల్లిలో ఉంటున్న ఆయనకు భార్య రుక్మిణి, ముగ్గురు కుమార్తెలు. జమార కలం పేరుతో జగన్మాథవరావు అనేక కవితా పుస్తకాలు వెలువరించాడు. జమార మృతిపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు, మండల కళాకారుల సంఘం నాయకులు మొగులోజి లక్ష్మీరాజం, కనపర్తి హన్మాండ్లు నివాళి అర్పించారు.



జగన్మాథవరావు(ఫైల్)

## భక్తిసంగీత గాయకురాలు ప్రమోద మృతి

వేములవాడ: పట్టణానికి చెందిన ప్రముఖ భక్తిసంగీత గాయకురాలు ప్రమోద(50) ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కళాకారులంతా పాతకూరగాయల మార్కెట్ వీధిలోని ఆమె నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. వేములవాడ నృత్యకళానికేతన్‌లో 20 ఏళ్లుగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజన్న ఆలయంలో నిర్వహించే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు, వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగే భక్తిసంగీత కార్యక్రమాలతోపాటు పట్టణంలో జరిగే సంగీత కచేరీలలో ఆమె పాల్గొనేవారు. యెల్ల పోశెట్టి, బొడ్డు రాములు, సావనపల్లి శ్రీనివాస్, వారాల దేవయ్య, నాదమునుల రామారావు, మిద్దె పర్శరాం, మాన్వాడ లక్ష్మీనారాయణ, వెంపటి సంతోష్‌కుమార్, మ్యాకల కొమురయ్య, చంద్రగిరి శరత్, నమిలికొండ జయంత్, మధు శ్రీనివాస్‌శాస్త్రీ, వాసు, వేణు నివాళి అర్పించారు.



ప్రమోద(ఫైల్)

### ఘనంగా సందల్ ఊరేగింపు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్థానిక ఇమామ్ అలీ దర్గా ఆధ్వర్యంలో సందల్ ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జామ మసీదు నుంచి హజురత్ సయ్యద్ ఇమామ్ అలీ దర్గా వరకు సందల్(గంధం)ను ఊరేగించారు. డప్పుచప్పుళ్ల మధ్య సందల్‌ను ఊరేగింపుగా తీసుకెళ్లారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, అందె సుభాష్, రఫీక్, లాల్ మహమ్మద్, డాక్టర్ హైమద్, బాబా, హలీం, యూత్ కమిటీ సభ్యులు రిజ్వాన్, జహంగీర్ పాల్గొన్నారు.